www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024 5 కాకినాడ



జల జీవన్ మిషన్ నిధులతో పనులు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం



మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఇప్పటివరకు 7 గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో మంచినీటి పథకాల పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ అప్పలరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 14 జగనన్న కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని, 13 కాలనీలలో జలజీవన్ నిధులతో మంచినీటి పథకాలు పూర్తి చేశామన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు చొరవతో తూర్పు పాకల గ్రామంలో రూ 7.5 లక్షలు, కొండపల్లి గ్రామంలో 3.5 లక్షలతో మంచినీటి బోర్లు, పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే జె.తిమ్మాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తామన్నారు.

ఏ సీటు ఎవరికి..?

కొలిక్కి వచ్చిన కూటమి సర్దుబాట్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలోనే అత్యధిక శాసనసభ స్థానాలు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విపక్ష కూటమి సీట్ల సర్దుబాటు పూర్తయింది. ఏ స్థానంలో ఏ పార్టీ బరిలో ఉండాలనే దానిపై పంపకాలు కూడా చేసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి మూడింట రెండొంతుల స్థానాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బరిలో దిగబోతోంది. మొత్తం 21 స్థానాలకు 15 స్థానాల్లో ఆ పార్టీ పోటీ చేస్తుంది. మిగిలిన ఆరు స్థానాలకు 5 చోట్ల జనసేన అభ్యర్థులు, ఒకచోట బిజెపి బరిలో ఉంటాయి.

2014 ఎన్నికల్లో బిజెపి గెలిచిన రాజమహేంద్రవరం అర్బన్‌కు మరోసారి ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేయబోతున్నారు. బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే బిజెపి అధిష్టానం నుంచి ఆయనకు సంకేతాలు వచ్చినట్టు చెబుతున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు సీటు కూడా బిజెపి ఖాతాలో పడడంతో ఎంపీ పరిధిలో ఒక అసెంబ్లీ సీటుకి బిజెపి బరిలో ఉండేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. అందుకు అనుగుణంగా రాజమహేంద్రవరం అర్బన్ సీటును బిజెపి తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇక జనసేనకు ఐదు స్థానాలు దక్కాయి. మూడు పార్టీల కీలక నేతలు ఉమ్మడి జిల్లాలో జరిపిన చర్చల తర్వాత ఎవరు ఎక్కడ బరిలో ఉండాలన్న దానిపై తాజాగా స్పష్టత వచ్చింది. దానికి తగ్గట్టుగా నియోజకవర్గస్థాయి నేతలకు కూడా సమాచారం అందిస్తున్నారు. దాన్ని బట్టి జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన రాజానగరం, కాకినాడ రూరల్ స్థానాలతో పాటుగా జనసేన సిట్టింగ్ సీటు రాజోలులో కూడా ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారు. ఈ మూడు స్థానాలతో పాటు అమలాపురం, పిఠాపురం, రామచంద్రపురం స్థానాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉండే అవకాశం కనిపిస్తోంది. రామచంద్రపురం కోసం టిడిపి కూడా పట్టుబడుతోంది. కెట్టిబిబితకు జిల్లాలో ఒక సీటు కేటాయించడం అనివార్యం కావడంతో టిడిపి ఆస్థానం కోసం గట్టిగానే ప్రయత్నిస్తుంది. అదే జరిగితే జిల్లాలో మరొక స్థానం జనసేనకు దక్కుతుందా లేక ఐదు సీట్లతో సరి పెట్టుకోవాల్సి వస్తుందా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

ఇక జనసేన బిజెపికి కలిపి ఆరు లేదా ఏడు స్థానాలు ఖాయం కావడంతో మిగిలిన 14 లేదా 15 సీట్లలో టిడిపి అభ్యర్థులు పోటీలో ఉంటారు. ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ స్థానాల్లో అభ్యర్థులను టిడిపి ఖరారు చేసింది. అయితే రాజమహేంద్రవరం సిటీ స్థానాన్ని ఇప్పటికే సిట్టింగ్ ఎంఎల్‌ఎ భర్త ఆదిరెడ్డి వాసుకు ఖరారు చేసింది. ఆయన ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సీటును బిజెపికి కేటాయిస్తారా లేదా? అనేది సందిగ్ధంలో ఉంది. కాకినాడ సిటీ విషయంలోనూ టిడిపి భారీగా కసరత్తు చేస్తుంది. జిల్లాలో ఒక్క సీట్ అయినా మత్స్యకారులకు కేటాయించాల్సిన అవసరం ఉండడంతో మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పేరు ఖరారు చేసే అవకాశం ఎక్కువ ఉంది. పి.గన్నవరం అసెంబ్లీ సీటును మహాసేన రాజేష్‌కి కేటాయించినప్పటికీ రాజకీయంగా ఎదురైన సవాళ్లతో ఆయన్ను ఉపసంహరించాల్సి వచ్చింది. ఇక కందుల దుర్గేష్‌కు నిడదవోలు కేటాయించడంతో రాజమహేంద్రవరం రూరల్ స్థానంలో టిడిపి తరఫున గోరంట్ల బుచ్చయ్య చౌదరి సీటు ఖరారైంది.

టిడిపి లిస్టులో 8 స్థానాలకు అభ్యర్థులకు లైన్ క్లియర్ అయ్యింది. మిగిలిన ఆరు లేదా ఏడు సీట్లలో ఎవరికి అవకాశం వస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అందులో ప్రత్తిపాడు, కాకినాడ సిటీ, రామచంద్రపురం, పి.గన్నవరం, గోపాలపురం, కొవ్వూరు ఉన్నాయి. ఈ సీట్లలో ఇప్పటికే ఆశావాహులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. అమలాపురం సీటు జనసేన ఖాతాలో పడితే ఆ సీటును ఆశిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు పి.గన్నవరం సీటును కోరే అవకాశం ఉంది. ప్రత్తిపాడులో ఇప్పటికే వరుపుల రాజా భార్య సత్యప్రభ చురుగ్గా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించే బలమైన వర్గం కూడా కనిపిస్తోంది. ఇక రామచంద్రాపురం సీటు కోసం ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. దీంతో జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులు పోటీ చేసే స్థానాల వ్యవహారం ఒక కొలిక్కి రావడంతో నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థులను కూడా ఖరారు చేయనున్నారు.

సిఎఎ రాజ్యాంగ విరుద్ధం

బిజెపి సర్కారుపై పలువురి విమర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)ను మళ్లీ తెరపైకి తెచ్చింది. 2019 డిసెంబర్ 11న పార్లమెంటులో అప్రజాస్వామికంగా బిల్లును ఆమోదింపజేసుకుంది. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దేశవ్యాప్తంగా ముస్లిములు వారికి మద్దతుగా ప్రగతిశీల శక్తులు నిరసనలను చేపట్టాయి. దీంతో వెనక్కి తగ్గిన బిజెపి ప్రభుత్వం నాలుగేళ్ల అనంతరం దీన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రజల మధ్య చిచ్చురేపేందుకే మళ్లీ దీన్ని తెరపైకి తెచ్చిందని వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వంతో అంటకాగుతున్న టిడిపి, జనసేనలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిఎఎ చట్టాన్ని అధికార వైసిపితో సహా టిడిపి, జనసేనలు కూడా వ్యతిరేకించాలని ముస్లిములు, ప్రజాస్వామ్య వాదులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు. ఈ అప్రజాస్వామికమైన రాజ్యాంగ విరుద్ధంగా చేపట్టిన సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలంటున్న వారి మనోభావాలు వారి మాటల్లోనే...



ఓట్ల కోసం బిజెపి చేస్తున్న కుట్ర



ఓట్ల కోసం బిజెపి చేస్తున్న కుట్ర

సమాజంలో విద్వేషపూరిత చర్చ జరగాలని తద్వారా వేర్పాటువాద శక్తులను రెచ్చ గొట్టి రానున్న ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పొందాలని బిజెపి చేస్తున్న కుట్ర ఇది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ ఇతర దేశాల నుంచి స్వాతంత్ర్యం ముందు నుంచీ ఉన్న వారికి మన దేశంలో పౌరసత్వం ఇవ్వడానికి పెట్టిన చట్టానికి మతం రంగు పూయడం రాజ్యాంగ విరుద్ధం. టిడిపి, జనసేన, వైసిపిలు రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని వ్యతిరేకించాలి. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఎదురు దెబ్బ తప్పదు.

- జవహర్ అలీ, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజల మధ్య చిచ్చు రగిల్చేందుకే...



శాంతియుతంగా జీవిస్తున్న దేశ ప్రజల మధ్య చిచ్చు రగిల్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చిన చట్టమే సిఎఎ. భవిష్యత్తులో ముస్లింలు, క్రైస్తవులు, దళితులను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చారు. ప్రజలకు అపకారం చేసే చట్టాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం మద్దతు తెలపడం శోచనీయం. సిఎఎ చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రకటన చేయాలి. ఇప్పటికైనా ప్రజలు మేలుకోవాలి. రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి, దానికి మద్దతు ఇచ్చే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారు. బిజెపికి, దానికి మద్దతిచ్చే పార్టీలకు ఓటు వేస్తే రాబోయే కాలంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

- నసీరుద్దీన్, జోనల్ అధ్యక్షుడు
అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్

దురుద్దేశపూర్వకంగా తీసుకొచ్చారు



ఇది సరైన యాక్ట్ కాదు. దురుద్దేశ పూర్వకంగానే ఒక మతంపై వివక్షత చూపుతూ, ఆ మతానికి వ్యతిరేకంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. మతపరమైన సిటిజన్ షిప్ ఇవ్వాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. కేంద్రం తీసుకొచ్చిన ఈ నోటిఫికేషన్‌పై మళ్లీ ఉద్యమాలు దేశవ్యాప్తంగా మొదలయ్యే అవకాశం ఉంది. చట్ట ప్రకారం దీనిని ఎదుర్కోవడానికి కృషి చేస్తాం. మతతత్వ పార్టీ అయిన బిజెపితో ఈ రాష్ట్రంలోని టిడిపి, జనసేన జత కట్టడం సరైంది కాదు. దీన్ని ముస్లిం పెద్దలంతా వ్యతిరేకిస్తున్నారు. ఈ రాష్ట్రంలో టిడిపిలోనూ, జనసేన లోను కూడా ముస్లింలు కార్యకర్తలుగా ఉన్నారు. వారి మనోభావాలను గౌరవించి టిడిపి, జనసేన పార్టీలు కూడా సిఎఎను వ్యతిరేకించాలి. ప్రభుత్వం కూడా సిఎఎను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఎస్.ఏజాజుద్దీన్, అడ్వకేట్, జామియా మస్జీద్ అధ్యక్షుడు, కాకినాడ

ప్రతి భారత పౌరుడూ వ్యతిరేకించాలి



ఆక్రమణ దారులను ప్రభుత్వం ఎప్పుడూ ఆహ్వానించడం జరగదు. కాని మతపరమైన కొలమానం అనేది మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. 1947 తరువాత నుంచి మన దేశంలో మతం, కులం ప్రాంతం ఎన్నడూ ఆధిక్యం చూపకుండా ఉండాలని రాజ్యాంగం పేర్కొంది. అందరూ స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించింది. కానీ మత పరమైన ఆంక్షలతో వలసదారుల నిర్ధారిస్తామంటూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రతి భారత పౌరుడు వ్యతిరేకించాలి. లేదంటే రానున్న కాలంలో అందరూ కులాల వారీగా పౌరసత్వం నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఈ బిల్లుకు ఎవరు మద్దతు ఇచ్చినా వారు దేశ సౌభ్రాతత్వాన్ని సోదర భావాన్ని దెబ్బతీసినట్లే.

- హసన్ షరీఫ్, ముస్లిం ఆలోచనా పరుల వేదిక రాష్ట్ర కో కన్వీనర్

మత ప్రాతిపదిక రాజ్యాంగ విరుద్ధం



భారతదేశం మత రహిత సెక్యులర్ పునాదులపై నిర్మించబడింది. కుల, మత, వర్ణ, వర్గ, భాష, లింగ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత విలువలు కలిగింది మన భారత రాజ్యాంగం. కానీ సిఎఎ ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రవేశ పెట్టడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ అధికరణ 14,15, మరియు 25లను ఇది ఉల్లంఘిస్తుంది. రాజ్యాంగ ఆత్మ దాని మౌలిక స్వరూపానికి ఇది వ్యతిరేకం. ఒక వ్యక్తికి పౌరసత్వం కల్పించేందుకు మతం ఆధారంగా తీసుకోవడం సహేతుకం కాదు. ఏదేశంలో కూడా ఇలాంటి సంకుచిత చట్టాలు ఉండవు. ఈ బిల్లు అమలైతే పేద దళిత ముస్లిం వర్గాలకు చెందిన వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలు సమర్పించడానికి వ్యయప్రయాసలకు గురికాక తప్పదు.

- కలీముల్లాఖాన్,
రాష్ట్ర అధ్యక్షులు, ఐడియల్ యూత్ మూమెంట్, ఆంధ్రప్రదేశ్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి - సామర్లకోట



రైల్వే స్టేషన్‌లో స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపి వంగా గీత

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపి వంగా గీత అన్నారు. మంగళవారం సామర్లకోట రైల్వే స్టేషన్లోని వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ స్టాల్‌ను ఎంపి గీత సందర్శించి కొనుగోలు చేసి ప్రోత్స హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యార్థం మోడీ రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. సామర్లకోట రైల్వే జంక్షన్‌ను రూ.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. నూతన ప్లాట్ ఫారంల నిర్మాణం, ఎస్కలేటర్ ల నిర్మాణం, లిఫ్ట్‌ల ఏర్పాటు, ఫుడ్ కోర్టు, పార్క్ తదితర సౌకర్యాలు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట రైల్వే ఎడ్వయిజరీ కమిటీ సభ్యుడు సుంకవిల్లి బాపిరాజు, బిజెపి నాయకులు వల్లూరి వెంకట స్వామి, పెన్నాడ జగన్నాధం, రవి కరణ్, విత్తనాల వెంకటరమణ, రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం. రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనసేనలోకి కొవ్వాడ సర్పంచ్ ఉమా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



జనసేనలో చేరిన సర్పంచ్ దంపతులకు కండువా వేసిన నానాజీ

మండలంలోని కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోటిపల్లి ఉమా, ఆమె భర్త సతీష్ వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. కాకినాడ రూరల్ జనసేన నాయకులు దుగ్గన బాబ్జి, నల్లం శ్రీరాములు, కొవ్వాడ జనసేన నాయకులు కోటిపల్లి శ్రీనుల ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్ ఉమాతోపాటు, సతీష్, పబ్బినీడి కృపారావు, తాతపూడి శాంతిశేఖర్, వేమగిరి రవికిరణ్, సలాది కన్నా నాయకత్వంలో పలువురు కొవ్వాడ నుంచి ర్యాలీగా వెళ్లి జనసేన నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి నానాజీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అఖిలపక్షం సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ



ఎస్‌పి సతీస్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలనే దానిప అఖిలపక్షం చేస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అఖిల పక్షం నాయకులు కోరారు. మంగళవారం ఎస్‌పి ఎన్.సతీష్ కుమార్‌ను అఖిలపక్షం నాయకులు కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన హక్కు ప్రదేశం నిర్ణయం చేయాలని ఏకగ్రీవ తీర్మానం ప్రతిని అందజేశారు. ఈ సందర్భం గా అఖిలపక్ష బృందం నాయకులు మాట్లాడుతూ ప్రజల తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు, రాజ్యాంగం కల్పించిన హక్కును కాపాడుకునేందుకు కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌ను ఉంచా లని అన్నారు. సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు దీక్షతో కలెక్టర్ స్పందించి అఖిలపక్షంతో చర్చలకు ఆదేశించారని తెలి పారు. ఆర్‌డిఒ, డిఎస్ పిలు అఖిలపక్షం నాయకులతో చర్చిం చారని, ఆర్‌డిఒ ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందించే క్రమంలో పోలీసు శాఖ నుంచి ఇచ్చే నివేదికలో అఖిలపక్షం సూచనలను పరిగణనలోకి తీసుకుని ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, న్యూడె మోక్రసీ, టిడిపి, కాంగ్రెస్, బిజెపి, జనసేన, ఆమ్‌ఆద్మీ, బిఎస్‌పి, ఆర్‌పిఐ, ఇతర ప్రజా సంఘాల నాయకులు మోర్తా రాజశేఖర్, దూసర్లపూడి రమణరాజు, అయితాబత్తుల రామేశ్వరరావు, దువ్వా శేషబాబ్జీ, తోకల ప్రసాద్, జల్లూరి వెంకటేశ్వర్లు, పప్పు దుర్గా రమేష్, టి.రమణి, చంద్రమళ్ల పద్మావతి, అయినాపురపు సూర్య నారాయణ, గుబ్బల ఆది నారాయణ, సిద్ధాంతుల కొండబాబు, పిట్టా వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులను తక్షణం విడిపించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సుధా సతీష్ ఆక్వా ఫామ్‌లో నిర్బంధించి వెట్టి చాకిరి చేయిస్తున్న ఆరుగురు బెంగాల్ కార్మికులను తక్షణం విడిపించి సొంత గ్రామాలకు పంపించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన గుర్తుతెలియని ఏజెంట్ ద్వారా పశ్చిమ బెంగాల్ బంకూర జిల్లా ప్రాంతం నుంచి ఆరుగురు వలస కార్మికులను15 రోజుల క్రితం జిల్లాలోని పెదపూడి మండలంలో ఉన్న సుధా సతీష్ ఆక్వా ఫార్మ్‌కు తరలించారని తెలిపారు. వారు వచ్చిన నాటి నుంచి యాజమాన్యం రోజుకు 16 గంటలకుపైబడి పని చేయిస్తుందన్నారు. వారికి అవసరమైన ఆహారం, వసతి కల్పించడం లేదని, పైగా వారి సెల్‌ఫోన్లను సైతం యాజమాన్యం తమ వద్ద పెట్టుకుని వారితో వెట్టిచాకిరి చేయిస్తుందని విమర్శించారు. పని పరిస్థితులు తట్టుకోలేక సామ్రాట్ భౌరి, సాధిన్ భౌరి, రాజీబ్ భౌరి, సంజయ్ భౌరి, తపస్ (దీపక్) భౌరి, సమర్ భౌరి అనే కార్మికులు సొంత గ్రామాలకు వెళతామంటే యాజమాన్యం పరిశ్రమలోపల నిర్బంధించిందని తెలిపారు. తక్షణం యాజమాన్యం చెర నుంచి బెంగాల్ కార్మికులను విడిపించి సొంత గ్రామాలకు పంపించాలని డిమాండ్ చేశారు. వెట్టి చాకిరి నిర్మూలన చట్ట ప్రకారం సుధా సతీష్ ఆక్వా ఫామ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్, జిల్లా ఎస్‌పి, డిఎస్‌పిలకు సామాజిక మాధ్యమం ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అవార్డులు సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి - కోటనందూరు





అవార్డులు సాధించిన విద్యార్థులు


సివి.రామన్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయి యంగ్ జీనియస్ అవార్డులను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థుల సాధిం చారని సంస్థ సంయుక్త కార్య దర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. జనవరి 27న రాష్ట్రవ్యాప్తంగా సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్, మాథ్స్ సైన్స్ విభాగాల్లో నిర్వహించిన రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో తమ సంస్థకు చెందిన 6వ తరగతి విద్యార్థి ఎం.దేదీప్య, 5వ తరగతి విద్యార్థి ఇ. నవీన్‌హర్ష రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. వీరిద్దరికి రాష్ట్ర స్థాయి యంగ్ జీనియస్ అవార్డులు వచ్చాయన్నారు. వీరితోపాటు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో 3వ తరగతి విద్యార్థి టి.గ్రీష్మ శ్రీ, 4వ తరగతి విద్యార్థి డి. విఖ్యాత్, 6వ తరగతి విద్యార్థి ఎస్.కౌషల్ కార్తికేయ, 7వ తరగతి విద్యార్థి జి.లిఖిత్, 8వ తరగతి విద్యార్థి కె.గిరిచరణ్, ద్వితీయ స్థానంలో 3వ తరగతి విద్యార్థి ఎ.సాత్విక, 5 తరగతి విద్యార్థి ఎ.జయంత్, 10వ తరగతి విద్యార్థి ఆర్.లలిత నిలిచారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రియల్ - 4న హైదరాబాద్ శ్రీ సత్య సాయి నిగమాగమంలో జరిగే కార్యక్రమంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు మరియు నగదు బహుమతి అందచేస్తారని అయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎం.చామవరంలోని వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జట్ల రాజా ఆధ్వర్యంలో కోట దొరబాబు, కోట చక్రవరావు, అడపా నాగేశ్వరరావు, ఏలూంరు బాబూరావు, రాశంశెట్టి దొర, గాజుల ఏసుబాబుల తోపాటు పలువురికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని తెలి పారు. అనంతరం ఇంటింటికీ మీ వరుపుల సత్య ప్రభ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ఎన్నికల మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అంద చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్య క్షులు టి.సత్యనారాయణ. మాజీ ఎంపిపి భాస్కర్ బాబు. ఎంపిటిసి సోమరౌతు రవి, సోమరవుతు చంద్రమౌళి, ఎనుముల జగదీష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రతి ఒక్కరినీ స్వాగతించాలి


ప్రజాశక్తి - జగ్గంపేట



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జ్యోతుల నవీన్

పార్టీ పట్ల ఆకర్షితులైన ప్రతీ ఒక్కరికీ స్వాగతం పలకాలని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరేందుకు ఆసక్తితో ఉన్న వారిని గుర్తించి ఆహ్వానించాలని, పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపును ఇస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయానికి ప్రతీ ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత తన సొంత అజెండా ద్వారా ఇల్లు లేని పేదలను గుర్తించి జి ప్లస్ టు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. అలాగే ఆడపిల్లకు వివాహం జరిగితే రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందిస్తామని అన్నారు. టిడిపి నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ యువత యువ గళం పేరుతో బస్సు యాత్ర ద్వారా గ్రామాల్లో పర్యటిస్తారని, మహిళా శక్తి కార్యక్రమంలో తన కోడలు లక్ష్మీదేవి, కుమార్తె సునీత కలిసి గ్రామంలో ఇంటింటికి పర్యటిస్తారని తెలిపారు. నాలుగు అంశాల ప్రమాణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈనెల 17న చిలకలూరిపేటలో జరిగే టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి సభలో నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల శంఖారావం పూరిస్తారని, ఆ సభకు జగ్గంపేట నియోజకవర్గం నుంచి 4 వేల మందికిపైగా తరలివెళ్లేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వికలాంగ బాలలకు ఫిజియోథెరపీ



ఫిజియోథెరిపీని పరిశీలిస్తున్న ఎంఇఒ కెఆర్‌కె చౌదంరి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో మంగళవారం వికలాంగ బాలలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ ఫిజియోథెరపీ క్యాంపును ఎంఇఒ కెఆర్‌కె.చౌదరి సందర్శించి ఫిజియోథెరపీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల బాలల తల్లిదండ్రులు భవిత కేంద్రంలో నిర్వహించే ఈ ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన బాలల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు బి అపర్ణ, స్కూల్ హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి, సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - కాజులూరు



విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అయోడిన్ లోపాన్ని నిర్లక్ష్యం చేయరాదని గొల్లపాలెం పిహెచ్‌సి వైద్యులు ఎన్ సౌజన్య సూచించారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం జడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపంతో రక్తహీనత, మందబుద్ధి, శారీరకంగా ఎదుగుదల లేకపోవడం, రుతుక్రమం సక్రమంగా రాకపోవడం, జుట్టు రాలిపోవడం, బరువు పెరగడం, తీవ్రమైన అలసట, హార్మోన్స్ విడుదలలో లోపాలు వంటివి జరుగుతాయని అన్నారు. వీటిని నివారించడానికి అయోడిన్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుశీలమణి, ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, వివిఎస్.మూర్తి, వైద్య సిబ్బంది రాజారావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వికె రాయపురం గ్రామంలో పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఫౌండేషన్ నాయకులు పాస్టర్ ఆర్ లాజరస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి పెన్నులు, అట్టలు, అందజేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన పి.రాజేష్, రాజకుమార్, పి.విజయ్ కుమార్, ఆర్.ప్రేమచందువెంకటేష్, వీరబాబు, ఆర్.రాజేష్, జి.కిరణ్‌కుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పంటబోదెలో మృతదేహం

ప్రజాశక్తి - కాజులూరు

పంట బోదెలో గుర్తు తెలియని మృత దేహం లభించిందని ఎస్ఐ ఎస్.తులసీరామ్ తెలిపారు. మంగళవారం కోలంక నుంచి చలిచెర్లపాడు రహదారిలో బ్రాండీ షాప్ సమీపంలో పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహం ఉందని రెవిన్యూ అధికారి సుబ్రహ్మణ్యం ఇచ్చిన సమాచారంతో సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని అన్నారు. సంఘటన ప్రాంతాన్ని సిఐ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేధింపుల కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండలానికి చెందిన బాలికపై వేధింపుల కేసులో నిందితుడు చప్పిడి అర్జున్ కు పోక్సో కోర్టు(కాకినాడ)7 సంవత్సరాలు జైలు శిక్ష రూ.11 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాల ప్రకారం.. 2020 జూలై 2న బాలికను వేధిస్తూ ఫొటోలు మార్ఫింగ్ చేసి ప్రేమిస్తున్నానని వేధిస్తూ చంపుతానని బెదిరించినట్లు నిందితుడు అర్జున్‌పై అప్పటి ఎస్ఐ ఎస్.కె.జానీ భాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని రిమాండ్ కు పంపించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పర్యవేక్షణలో కాకినాడ కోర్టులో ట్రయల్ జరుగగా పిపి పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు. చిన్నపిల్లలపైన, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ జానీ భాషా, సిబ్బందిని ఎస్పీ ఎస్. శ్రీధర్ అభినందించారు.

పేదల ఆరోగ్య భద్రతకే జెఎఎస్

ప్రజాశక్తి - కాజులూరు

పేదల ఆరోగ్య భద్రతకే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని కాజులూరు ఉపసర్పంచ్ దండంగి చిన్నారావు అన్నారు. మంగళవారం కాజులూరు పంచాయతీ కార్యాలయం వద్ద జెఎఎస్ శిబిరాన్ని నిర్వహించారు. దుగ్గుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సుధీరు ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో వైసిపి నాయకులు రెడ్డి నాగేశ్వరరావు, కట్ట రామ్‌శేఖర్, వైద్య సిబ్బంది సురేష్, వెంకటరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వందే భారత్ -2కు స్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వందే భారత్ -2 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సామర్లకోట రైల్వే స్టేషన్లో ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోట చేరుకోగా పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పెద్దాపురం ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

తక్కువ ప్యాకేజీకే మెడికల్ పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం తక్కువ ప్యాకేజీతో మెడికల్ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమని ఎపి సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి అన్నారు. మంగళవారం 'ఆరోగ్య మహిళల ఆరోగ్యకరమైన కుటుంబం' లక్ష్యంతో ప్రత్యేకంగా రూపొందించిన 'హెల్త్ ప్యాకేజీని' ఆమె స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ మహిళలకు ప్రత్యేక హెల్త్ ప్యాకేజీని అందించడం హర్షనీయమన్నారు. మారుమూల ప్రాంత ప్రజలు ఆరోగ్యపరమైన ఇబ్బందులతో జీవిస్తున్నా ఆర్థిక కారణాలతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. తక్కువ ప్యాకేజీతో రూ.4 వేలకే 21 రకాల మెడికల్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

గీతాంజలికి నివాళులు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఐటీడిపి ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలికి వైసిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. మంగళవారం స్థానికంగా సంతాప కార్యక్రమాన్ని వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ ఎస్తేర్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు ఎస్.ఎ.గఫూర్ మాట్లాడుతూ ఐటిడిపి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. గీతాంజలి సామాన్య మహిళని, సంక్షేమ పథకాలపై ఆమె వ్యాఖ్యలను తట్టుకోలేక ఐటిడిపి మానసిక క్షోభకు గురిచేసేలా సోషల్ మీడియాలో ప్రచారాన్ని పెంచడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. అనంతరం మెయిన్ సెంటర్ నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ జాగాలు, కాపవరపు ప్రసాద్, సప్పా రఘురామ్, గున్నాబత్తుల వాసు, ఎన్. డి.రాజారత్నం పాల్గొన్నారు.

తాళ్లరేవులో గడపగడపకూ వైసిపి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీలో గడప గడపకూ వైసిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినిదేవి, ఆకుల వెంకన్న, బొంతు మోహన్ ఆధ్వర్యంలో సాగింది. ఈ సందర్భంగా మాధవరాయని పేట, కేశవస్వామి కాలనీ, రెడ్డివారి పేట, మర్రి వారి పేటలలో ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, ఎంపిటిసి సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, శ్రీమన్నారాయణ, వార్డు సభ్యులు టేకుమూడి రాంబాబు పాల్గొన్నారు.

హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు గ్రామంలో సర్పంచ్ అనిశాగాలి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో అందరికీ ఇళ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.రాజశేఖర్, సింగన త్రిమూర్తులు, కోనపురెడ్డి స్వామి, నరేష్ పాల్గొన్నారు.

జెసి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ



జెసిని అభినందిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కాకినాడ జిల్లాలో సుమారుగా నెలన్నర పాటు జెసిగా చేసిన సివి.ప్రవీణ్ ఆదిత్య సేవలు అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. మంగళవారం సాధారణ బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా జెసిగా వెళ్తున్న ప్రవీణ్ ఆదిత్యను కలెక్టరేట్ లో జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, డిఆర్ఒ డి.తిప్పేనాయక్, కమిషనర్ జె.వెంకటరావు, ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. తనకు సహకరించిన అధికారులకు ప్రవీణ్ ఆదిత్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



ఎస్‌బిఐ బ్రాంచ్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ తక్షణమే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని తాళ్ళరేవు సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సీతారాంపురం ఎస్‌బిఐ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఎలక్ట్రోరల్ బాండ్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా బిజెపి, ఇతర పార్టీలకు బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలు సమకూరాయని అన్నారు. బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సిపిఎం మొదటి నుంచి డిమాండ్ చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కేలా ఎస్‌బిఐ యాజమాన్యం వ్యవహరించడం కోర్టు ధిక్కరణే అవుతుందన్నారు. తక్షణమే సంబంధిత వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వళ్ళు రాజుబాబు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, తనుకు రాజు, దుప్పి అదృష్టదీపుడు, విప్పర్తి శ్రీనివాసరావు, చల్లా సంతోష్‌కుమార్, భవాని పాల్గొన్నారు.

నేడు ఎంపీ బోస్ పర్యటన

ప్రజాశక్తి - కాజులూరు

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నేడు కాజులూరులో పర్యటించనున్నారని సర్పంచ్ దండంగి సరోజిని, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కాజులూరులో నిర్మించిన రెండు సచివాలయాలతోపాటు ఇటీవల నిర్మించిన పలు ఆలయాలను బుధవారం ఉదయం ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంఒ రామారెడ్డి

ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధపడాలి

ప్రజాశక్తి - సామర్లకోట

10వ తరగతి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని అసిస్టెంట్ మోనటరింగ్ ఆఫీసర్ (ఎఎంఒ) ఎంవి.రామారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు, పేరెంట్స్‌కు ప్రత్యేక కార్యక్రమాన్ని హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి అనేది విద్యార్థి జీవితంలో చాలా కీలకమైనదని అన్నారు. పరీక్షలను సమర్థవంతంగా రాయడానికి జిల్లా విద్యాశాఖ నూరు రోజుల ప్రత్యేక ప్రణాళిక ద్వారా రివిజన్ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లు, ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. హెచ్‌ఎం సాయి రామకృష్ణ మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా పరీక్షలను పండగలా భావిస్తూ సిద్ధపడాలని సూచించారు. నూతన విద్యావిధానంలో 7 పేపర్లు రాయాల్సి ఉంటుందని, పాస్ కావడం సమస్యే కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, జి గోవిందు, కె.అరుణ, కెవివి. సత్యనారాయణ, ఎఎల్‌వి.కుమారి, బ్రహ్మానందం పాల్గొన్నారు.

గీతాంజలి చావుకు వేధింపులే కారణం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



గీతాంజలి చావుకు టిడిపి, జనసేన పార్టీలే కారణమని రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ జమ్మలమడక నాగమణి అన్నారు. గీతాంజలి ఆత్మహత్య ఉధంతంపై ఆమె మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. తెనాలి పట్టణానికి చెందిన గీతాంజలి జగనన్న కాలనీ ఇంటి స్థలం గురించి మాట్లాడిందని, అది చూసి ఓర్వలేక టిడిపి, జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా ఆమెను మానసికంగా హింసించడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. సామాన్యులపై దూషణలకు దిగే సోషల్ మాఫియాలను కోట్లు వెచ్చించి పెంచి పోషిస్తున్న టిడిపి, జనసేన మాఫియాను రాష్ట్రం నుంచి తరిమి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు.



పెద్దాపురం సభలో మాట్లాడుతున్న దాడి బేబి

మహిళా హక్కులను హరిస్తున్న మతోన్మాదం

ప్రజాశక్తి - పెద్దాపురం, పెదపూడి

దేశంలో మహిళా హక్కులను మతోన్మాదం హరిస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు దాడి బేబీ అధ్యక్షతన మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట వరసకు మాత్రమే మహిళా సాధికారత పదాన్ని వాడుతున్నారని అన్నారు. ఇప్పటికీ అనేక వృత్తులలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి ఎస్తేరురాణి మాట్లాడుతూ గౌరవ వేతనం పేరుతో అంగన్‌వ్వాడీ, ఆశా, మిడ్ డే మిల్స్ వర్కర్స్, యానిమేటర్స్‌కు ప్రభుత్వాలే తక్కువ వేతనాలు ఇవ్వడం అన్యాయమన్నారు. సభాధ్యక్షులు బేబీ మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారం, మహిళా హక్కుల పరిరక్షణ మహిళా పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ సభలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లావణ్య, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరక సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు టిఎల్. పద్మావతి, అన్నపూర్ణ, లోవకుమారి, స్నేహలత, లక్ష్మి, నూకరత్నం, వసంత పాల్గొన్నారు. పెదపూడి మండలంలో గొల్లల మామిడాడ మార్కెట్ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీలు, ఆశాలు, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.సత్తిరాజు పాల్గొని మాట్లాడారు. గతంలో మహిళలకు ఓటు హక్కు గానీ, కుటుంబ ఆదిపత్య హక్కు గానీ ఉండేది కాదని అన్నారు. నేటి మహిళ అన్ని రంగాలలోని అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ప్రతి పిల్లలను ఆడ మగ తేడా లేకుండా చదివించి వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడే వరకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.రాజేశ్వరి, యు.ఉమావతి, డి.మేరీ రత్నం, ఏ కనకదుర్గ, జి సత్యవతి, వి భారతి, బి.బాంధవి, కష్ణవేణి, చిన్న వేణు మిడ్ డే మిల్ డి సుబ్బలక్ష్మి, అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు, మిడ్ డే మీల్ వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పెద్దపూడిలో సీనియర్ కార్యకర్తలను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

నానాజీ గెలుపే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

జనసేన రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ గెలుపే లక్ష్యం కావాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వైసిపి దుర్మార్గులు సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేశారని, తాను మాత్రం టిడిపిని వీడేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన పాలన సాగుతుందని, అలాంటి పాలన అంతమొందించి రాష్టంలో అభివృద్ధి, సంక్షేమ పాలన అందించే చంద్రబాబు పాలన తీసుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టిడిపి, జనసేన, బిజెపిల పొత్తు రాష్ట్ర అభివృద్ధి కోసమేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనకు సీటు వచ్చినట్లే భావించి పంతం నానాజీని గెలిపించాలని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి అన్నారు. పొత్తులో భాగంగా తనకు సీటు వచ్చిందని తన గెలుపునకు కృషి చేస్తున్న ఇరుపార్టీల నాయకుల, కార్యకర్తల సహకారాన్ని మర్చిపోనని అన్నారు. పిల్లి సత్యనారాయణ దంపతులు చేస్తున్న సహకారం తాను మరువనన్నారు. రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞులైన పిల్లి దంపతుల సలహాలు, సూచనల తీసుకుని ఎన్నికల ప్రచారం చేస్తానని కార్యకర్తలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), కడలి ఈశ్వరి, కరెడ్ల గోవింద రాజులు, బోళ్ల కృష్ణమోహన్, తాతపూడి రామకష్ణ, మట్టా ప్రకాష్, బుంగా సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి అంజిబాబు, గుత్తుల రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం



కాకినాడలో అభిమానులకు స్వీటు తినిపిస్తున్న సునీల్

ప్రజాశక్తి - కాకినాడ, జగ్గంపేట

కాకినాడ వైసిపి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చలమలశెట్టి సునీల్ కార్యాలయంలో ఆయన కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ఢిల్లీ పెద్దలని ఎదిరించి స్థాపించిన పార్టీ వైసిపి అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పన శివ, బత్తుల సాయి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు చీకట్ల కిశోర్ పాల్గొన్నారు. అలాగే జగ్గంపేటలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని వైపిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు పాటి శివ కుమార్ పాల్గొన్నారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి వేడుకలు జరిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు రఘురామ్ మాట్లాడుతూ 2011లో జగ్గంపేట గ్రామంలో వైసిపి ఆవిర్భవించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - కరప

10వ తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులకు పరీక్ష రాసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బొండా సూర్యారావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల యొక్క ప్రభావాన్ని వివరించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అందుకు తగిన విధంగా అభ్యసించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పత్తి సత్యనారాయణ, హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, మాజీ సర్పచ్ పోలిశెట్టి తాతీలు, కూనపరెడ్డి వీర్రాజు, మారిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

ప్రజాశక్తి - గండేపల్లి



చెక్‌పోస్టు వద్ద పహారా కాస్తున్న పోలీసులు

ఎన్నికలను పురష్కరించుకుని మండలంలోని మురారి గ్రామంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తులో భాగంగానే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండేలా ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ చెక్‌పోస్టులో 24/7 తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

పౌష్టికరమైన ఆహారంతో ఆరోగ్య రక్షణ ఏర్పడుతుందని ఐసిడిఎస్ పిఒ ఎం.పూర్ణిమ అన్నారు. మంగళవారం మండలంలోని మురారి ఎస్‌సి కాలనీ కమ్యూనిటీ హాల్లో సూపర్‌వైజర్ నాగ పార్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలతోపాటు, గర్భవతులు, బాలింతలు ఆహారంగా తీసుకోవచ్చునని సూచించారు. అనంతరం గర్భవతులకు శ్రీమంత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.

సుబ్బరాజు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని జి.వేమవరం, చొల్లంగిపేట పంచాయతీల్లో టిడిపి నియోజకవర్గ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. ఎంఎల్‌ఎగా తనను, ఎంపి అభ్యర్థి గంటి హరీష్ మాథుర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గండి అప్పారావు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు గండి అనిల్, ధూళిపూడి వెంకటరమణ (బాబి), పొన్నమండ రామలక్ష్మి, దాసరి జగదీశ్వరి, టేకుమూడి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మహిళలు అందరూ ఆర్థికంగా ఎదగాలని, మండల మహిళా సమాఖ్య ఎపిఎం శ్రీధర్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో విఒఎలకు ఆర్థిక క్రమశిక్షణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు డ్వాక్రా రుణాలను తీసుకుని ఆర్థికంగా ఎదుగుతూ తమ కుటుంబాలకు ఆసరా ఉంటున్నారని అన్నారు. రాబోయే రోజులలో మరింత అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో రామేశ్వరం గ్రామంలో టిడిపి యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి సూపర్ సిక్స్ పథకాలు, మహాశక్తి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి వేటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

కరప హైస్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - కరప



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డిఇఒ రమేష్

ప్రధానమంత్రి ఎక్సెన్స్ అవార్డుకు కరప హైస్కూల్ ఎంపిక అయ్యిందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. మంగళవారం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్పర్ట్ ప్రోగ్రాం, ఇంట్రాక్టివ్ ప్లాట్ ప్లానర్స్, బైజుస్, ట్యాబ్ వినియోగం, టోఫెల్ నిర్వహణ, ఆంగ్ల సామర్థ్యాలు వంటి విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు నిర్వహణపై పరిశీలించారు. జిల్లాలోని 25 పాఠశాలలో పిఎం ఎక్సెన్స్ అవార్డుకు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 పి. సత్యనారాయణ హెచ్‌ఎం బి.స్వర్ణరాణి పాల్గొన్నారు.